క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్పకు చెందిన అవుల నాగేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆరోగ్య వివరాలు, చికిత్స గురించి అడిగి తెలుసుకుని భరోసా కల్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

ఓటర్ల జాబితా ప్రచురణ

సోమశిల: అనంతసాగరం మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితా ప్రచురణ చేసినట్లు తహసీల్దారు సుభాషిణి సోమవారం తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెళ్లి ఓటర్లు తమ పేరు ఉందో లేదో చూసుకోవాలన్నారు. ఓటరుగా నమోదు కాని వారు బీఎల్‌ఓలను సంప్రదించి ఫారం–6 ద్వారా దరఖాస్తు పూర్తి చేయాలని తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పక ఓటర్లుగా నమోదు కావాలన్నారు.

ఆర్డీఓతో అధికారుల మర్యాదపూర్వక భేటీ



ఆర్డీఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీఓ, తదితరులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్డీఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కురుబా మధులతను సోమవారం ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ శ్రీనివాసులు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఉదయగిరి: మండలంలోని వెంగళరావునగర్ సచివాలయంలో మంగళ, బుధవారాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొనే ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలన్నారు.

బ్యాంకు పథకాలపై కళాజాత ప్రదర్శన

వరికుంటపాడు: మండలంలోని తోటల చెరువుపల్లిలో సోమవారం గండిపాళెం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంకు పథకాల అవగాహనపై కళాజాత ప్రదర్శన జరిగింది. బ్యాంకు మేనేజర్ శోభన్‌బాబు మాట్లాడుతూ తమ బ్యాంకులో ఏటీఎం కార్డు కలిగిన ఖాతాదారుడికి రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. సేవింగ్స్ బ్యాంకు ఖాతాకు నామిని సౌకర్యం ఉందన్నారు. ఖాతాదారులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి జీరో వడ్డీ రాయితీ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ఇంతియాజ్, వీఓఏ శృతి, సిబ్బంది చిన్నఖాసిం తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను బస్సు ఢీకొని ఒకరికి గాయాలు



క్షతగాత్రుడ్ని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

సంగం: బైక్‌ను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ర్యాంపు వద్ద నెల్లూరు– ముంబయి జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. మండలంలోని వంగళ్లుకు చెందిన వెంకటేశ్వర్లు తన బైక్‌పై సంగం వైపు నుంచి వస్తుండగా వెనుక వైపు నుంచి ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ప్రమాదంలో స్వల్పంగా గాయపడి వెంకటేశ్వర్లును చికిత్స నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



కాలువ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీపీ

చేజర్ల: చేజర్ల గిరిజన కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. పంచాయతీ సాధారణ నిధులతో గిరిజన కాలనీలో సైడ్ డ్రైనేజీ నిర్మాణం జరుగుతోంది. ఎంపీపీ మాట్లాడుతూ పనులు నాణ్యతతో ప్రజలకు అసౌకర్యం లేకుండా చేస్తున్నారన్నారు. చేజర్ల అభివృద్ధికి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందించి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు వంగవరపు ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

సామాజిక సాధికార జోష్



సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన జనంలో ఓ భాగం

- బస్సు యాత్రకు ప్రజల అపూర్వ ఆదరణ
- ఊహించిన దానికంటే మిన్నగా తరలివచ్చిన జనం
- కిక్కిరిసిన ఉదయగిరి

ఉదయగిరి/ కలిగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర అన్ని వర్గాల్లో జోష్ నింపింది. బస్సు యాత్రకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి అపూర్వ ఆదరణ చూపించారు. తొలుత వింజమూరులో చెన్నకేశవస్వామి దేవస్థానం వద్ద నుంచి యాత్ర ప్రారంభమైంది. బంగ్లా సెంటర్ వరకు రెండు గంటల పాటు పాదయాత్ర జరిగింది. మధ్యలో బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో పలు విషయాలు చర్చించారు. వేలాది మంది మహిళలు పాదయాత్రలో అడుగులు కలిపారు. బంగ్లా సెంటర్‌లో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమీపంలో జాగీరువనం వద్ద రాజకీయాలతో సంబంధం లేని తటస్తులు, విద్యావంతులతో రీజనల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు విషయాలు చర్చించారు. అనంతరం దుత్తలూరు సెంటర్‌లో సామాజిక సాధికార యాత్ర స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. మోటార్‌బైక్ ర్యాలీగా ఉదయగిరి చేరుకున్నారు. ఉదయగిరిలోని ట్యాంక్‌బండ్ నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని సభా ప్రాంగణం వరకు పాదయాత్ర నిర్వహించారు. నియోజకవర్గంలోని 8 మండలాల నుంచి వేలాది మంది యాత్రలో పాల్గొన్నారు. ఉదయగిరి పట్టణం జనసంద్రాన్ని తలపించింది. దారిపొడవు ఉన్న ప్రజలను నాయకులు అప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు.

మేకపాటి అభిమానుల్లో సంబరాలు

ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని ఎమ్మెల్యే అభ్యర్థిగా రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి ప్రకటించడంతో అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం సామాజిక వర్గాల వారీగా చేసిన మేలు ప్రచారం చేసేందుకు వచ్చిన పార్టీ మంత్రులు, ఎంపీలు, ముఖ్య నేతలకు ప్రజలే ఎదురేగి తమ సంతోషాన్ని వ్యక్త పరచడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో కొత్త జోష్ వచ్చింది.



సామాజిక సాధికార యాత్ర బహిరంగ సభలో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి



వేమిరెడ్డి, విజయసాయిరెడ్డి, మస్తాన్‌రావు, రాజారెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న నేతలు









ర్యాలీగా వెళ్తున్న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి, బీద, విజయసాయిరెడ్డి, నారాయణస్వామి, రాజారెడ్డి



సామాజిక సాధికార యాత్రపై పూలవర్షం కురిపిస్తున్న అభిమానులు



సామాజిక సాధికార యాత్రపై మిద్దెల మీద ఎక్కి పూల జల్లులు కురిపిస్తున్న మహిళలు

పేదలకు అన్ని రకాలుగా సీఎం అండదండ

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలోని పేదలందరికీ అన్ని రకాలుగా అండదండగా ఉండాలని ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యంగా పెట్టుకున్నారని, పేదల ఇళ్ల వద్దకే ప్రభుత్వ వైద్య సేవలు అందించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కావలిలోని వైకుంఠపురంలో 35, 36, 38 వార్డులకు చెందిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి, ఆరోగ్య, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా 7 రకాల వైద్య పరీక్షలు చేయడంతో పాటు 172 రకాల మందులను కూడా ఉచితంగా అందజేసి అందరి ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. అప్పట్లో చంద్రబాబు ఆరోగ్యశ్రీని ఎలా వదిలించుకోవాలన్న ఆలోచనలతో పరిపాలన సాగిందని, రాష్ట్రంలో 108, 104 వాహనాలకు కనీసం డీజిల్ ఖర్చులు ఇవ్వడానికి వెనకాడే పరిస్థితి ఉండేదని ఎమ్మెల్యే గుర్తు చేశారు. జగనన్న పాలన వచ్చిన వెంటనే రాష్ట్రంలో 104, 108 వాహనాలు ఏకంగా 1,600 కొత్త వాహనాలు కొనుగోలు చేసి ప్రతి పేదవాడికీ తోడుగా ఉండేట్లుగా ఏర్పాటు చేశారని వివరించారు. అప్పట్లో కేవలం 1000 రోగాలకు పరిమితమైన ఆరోగ్యశ్రీని ఇవాళ 3,300 రోగాలకు విస్తరించినట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ మాత్రమే కాదు ఆ పేషెంట్ ఏదైనా ఆపరేషన్ చేసుకుని ఇబ్బందులు పడే పరిస్థితుల్లో ఇంటికి వెళ్లి పని చేసుకోలేరని నెలకు రూ.5 వేల చొప్పున రెస్ట్ కోసం ఆరోగ్య ఆసరా తీసుకొచ్చినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఏకంగా 18 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వీటిలో కొన్ని ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు. గ్రామ, గ్రామాన విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కనిపిస్తోందని, ఈ సేవలన్నింటికీ తోడు జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రతి ఇంటికీ వచ్చి జల్లెడ పడుతూ మందులు, టెస్టులు, చికిత్సలు ఉచితంగా చేయడం కోసం మిమ్మల్ని చేయిపట్టుకుని నడిపించే పరిపాలన జరుగుతోందని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, గుడ్లూరు మాల్యాద్రి, ఏగూరు చిన్న పుల్లయ్య, పొనుగోటి అనురాధ, ఏటూరి పిచ్చిరెడ్డి, రమేష్, వెంకటేశ్వర్లు, అబ్రహాం, రవి, కరీం, సాయి తదితరులు పాల్గొన్నారు.



బాలింతకు పౌష్టికాహారం అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాలి

దగదర్తి (కావలి): కేవలం అర్హతనే ప్రామాణికంగా తీసుకుని కులాలు, మతాలకు, వర్గాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని దగదర్తి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు అన్నారు. దగదర్తి సచివాలయంలో సోమవారం ఎంపీపీ ప్రభుత్వం వివిధ వర్గాల ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమిష్టి కృషితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సహకారంతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పైరవీలు, సిఫార్సులు లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తుండడంతో ప్రజల్లో ప్రభుత్వంపై మరింత అభిమానం పెరిగిందన్నారు. ఇంకా అర్హులై ఉండి, ఏవైనా సాంకేతిక కారణాలతో పథకాలు అందకుండా ఉంటే వారి వివరాలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించడానికి చొరవ తీసుకుంటానని ఎంపీపీ చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో పథకాల పంపిణీ పట్టికను చూపిస్తున్న ఎంపీపీ ప్రసాద్‌నాయుడు

డ్రైవర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఆత్మకూరురూరల్: విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డిపో డ్రైవర్‌పై కావలిలో ఈ నెల 26న దాడి చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ యూనియన్ల నాయకులు సోమవారం ధర్నా చేశారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ నాయకులు భాస్కర్, మహమ్మద్ ఆలీ, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎ ప్రతాప్‌రెడ్డి, కార్మిక సంఘం నాయకులు పెంచలయ్య, ఎన్ఎంయూ నాయకులు సీహెచ్ సుధీర్, తదితరులు ధర్నాకు సంఘీభావం ప్రకటించి ప్రసంగించారు. మున్సిపల్ పరిధిలోని వర్కర్స్ యూనియన్ నాయకులు, ఇతర కార్మిక సంఘాలు పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు, ఆర్టీసీ యూనియన్ల నాయకులు

కంటి పరీక్షలకు 72 మంది ఎంపిక



ఉచిత వైద్యశిబిరంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న కంటి సమస్య బాధితులు

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో భారత రక్షణశాఖ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి దాతృత్వంతో నిర్వహిస్తున్న శంకర నేత్రాలయ ఉచిత కంటి వైద్య శిబిరంలో సోమవారం 72 మందికి ఆపరేషన్లు అవసమని గుర్తించినట్లు డాక్టర్ కె.అరుణ్ కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 300కిపైగా రోగులను పరీక్షించామని, వీరిలో తమ సంచార వాహనాల్లో 72 మందికి కాంటరాక్ట్ ఆపరేషన్లు చేస్తామన్నారు. మరో 30 మందికి చెన్నైలోని శంకర నేత్రాలయం వైద్యశాలలో ఆపరేషన్లు చేసేందుకు సిఫారస్సు చేశామన్నారు.

ప్రశాంతత భగ్నానికి విపక్ష పార్టీల కుట్రలు

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి నియోజకవర్గంలో ప్రశాంతతను భగ్నం చేయడానికి టీడీపీ, దాని తోక పార్టీ జనసేనలు అనేక కుట్రలు చేస్తోన్నాయని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలో సోమవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ప్రజల అభిమానం, నమ్మకం కోల్పోయిన టీడీపీ, జనసేన పార్టీలు దారుణాలు, దుర్మార్గాలు, దురాగతాలు చేసి వాటిని వైఎస్సార్‌సీపీపై నెట్టేసి రాజకీయంగా పబ్బం గడుపుకోవడానికి దిగజారి ప్రవర్తిస్తున్నాయని ఎమ్మెల్యే మండిపడ్డారు. అధికారం కోల్పోయామనే బాధ, భవిష్యత్‌లో అధికారంలోకి వస్తామని ఆశ లేకపోవడంతో అసహనంతో రగిలిపోతున్న ఆ రెండు పార్టీలు, వీటికి మద్దతు పలికే పచ్చ మీడియా అలజడులు సృష్టించి, ఎంతటి దారుణాలకైనా తెగించేందుకు రౌడీమూకలను పోషిస్తున్నాయన్నారు. కావలిలో ఇటీవల జరిగిన ఘటనలు చూస్తే వాటి వెనుక ఎవరున్నారనే విషయాలు బయటకు తీస్తే టీడీపీ, జనసేన, బీజేపీ చిల్లర నేతలు రాజకీయాలు బయటపడుతున్నాయన్నారు. విపక్ష పార్టీలు, పచ్చమీడియా దుశ్చర్యలను కావలి ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. కావలిలో రౌడీమూకలను పెంచి పోషించిన పార్టీలు ఎవరు, వారు ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు తెలుసునన్నారు. వ్యాపారులు నిర్భయంగా చేసుకోవాలని, ఎవరికో భయపడాల్సిన అవసరం లేదన్నారు. రౌడీమూకలను సమర్థవంతంగా కట్టడి చేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలందరూ ధైర్యంగా ఉండాలని కోరారు. ప్రజలకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఎక్కడైనా రౌడీ గ్యాంగులు బెదిరిస్తున్నట్లు తనకు సమాచారం అందిస్తే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవడానికి ఆగమేఘాల మీద స్పందిస్తామన్నారు. చట్టం తన పని అది చేసుకుపోతుంటుందని చెప్పారు. దుష్టశక్తులకు సమాజంలో స్థానం లేదని, వారికి కచ్చితంగా శిక్ష పడుతుందన్నారు. అసాంఘికశక్తులను సమర్థిస్తూ తోక పార్టీలు లాభ పడాలలని ఆశ పడితే, ప్రజలే తగిన సమయంలో వారికి బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే హెచ్చరించారు.

సంక్షేమంలో నూతన ఒరవడి



చెన్నారాయనిపాళెంలో మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- పేదలకు ఉపయోగపడేలా పథకాలు
- గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు
- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల అమల్లో నూతన ఒరవడి మొదలైందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెన్నారాయనిపాళెంలో సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాల పేరుతో పేదలకు ఉపయోగపడేలా పలు అభివృద్ధి పథకాలకు రూపకల్పన చేశారని తెలిపారు. పేదరికాన్ని నిర్మూలించేలా, జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసేలా సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా పేదల ఇంటి ముంగిటకే చేరుస్తున్నారు. గ్రామాల్లోని పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేయడంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తరహాలో పేదలకు వైద్యసేవలు అందిస్తున్న ఘనత దేశంలో రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షల వంతున మంజూరు చేసినట్లు వివరించారు. చెన్నారాయినిపాళెం పంచాయతీకి అదనంగా మరో రూ.10 లక్షలు కూడా కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, సర్పంచ్ గిరి, వివిధ విభాగాల అధికారులు, వైఎస్సార్‌సీపీ మండల యువత అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు, స్థానిక నాయకులు పవన్‌రెడ్డి, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. సోమవారం వివిధ ప్రాంతాల్లో సురక్ష శిబిరాలను నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారికి కార్పొరేట్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ ద్వారా సిఫాస్సు చేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యం ప్రతి ఇంటికి అందుతుందని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.



మర్రిపాడు : జగనన్న ఆరోగ్య సురక్షలో మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా సుబ్బిరెడ్డి



కలిగిరి: కలిగిరిలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ మాల్యాద్రిరెడ్డి, రవీంద్రారెడ్డి

పంట కాలువ సమస్య పరిష్కారానికి చర్యలు

దగదర్తి (కావలి): దగదర్తిలో పూడిపోయిన పంట కాలువను పునరుద్ధరించే పనులు చేపట్టి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు చెప్పారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ఇరిగేషన్ శాఖకు ఆ కాలువతో సంబంధం లేదన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ దగదర్తి చెరువు నుంచి 200 ఎకరాలకు సాగు నీరు చేర్చే పంట కాలువ ఇరిగేషన్ శాఖది కాకుండా ఏ శాఖ పరిధిలోకి వస్తుందని ప్రశ్నించారు. ఈ సమస్యపై రైతులు కలెక్టర్‌కు 'జగనన్నకు చెబుదాం' లో అర్జీ ఇచ్చారని, కలెక్టర్ కూడా ఈ సమస్యను సత్వరమే పరిష్కరించాలని సీరియస్ ఉన్నారని ఎంపీపీ గుర్తు చేశారు. దీంతో ఇరిగేషన్ అధికారులు నీళ్లు నమిలారు. ఉపాధి హామీ పథకం కింద పూడిపోయిన పంట కాలువను పునరుద్ధరించే పనులు చేయాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు.



ఇరిగేషన్ అధికారులు, రైతులతో మాట్లాడుతున్న ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు

బీజేపీ బలోపేతానికి కృషి

చేజర్ల: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేద ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ కోరారు. స్థానిక ఓ కల్యాణ మండపంలో సోమవారం బీజేపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ చేజర్ల మండల నూతన కమిటీని నియమించారు. బీజేపీ చేజర్ల మండల అధ్యక్షుడిగా జి విజయభాస్కర్‌రెడ్డిని నియమించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల కృష్ణయ్య, నర్సింహులు, ప్రధాన కార్యదర్శులు బుజ్జిరెడ్డి, రాజేష్, నాయకులు కుంకు బాలయ్య, ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం తనిఖీ

సోమశిల: మండలంలోని కామిరెడ్డిపాడు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఎంఈఓ కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. 3, 4, 5 తరగతుల విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించారు. ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పంట నమోదు జాబితా ప్రదర్శన

కలిగిరి: కలిగిరిలోని గ్రామ సచివాలయంలో ఖరీఫ్ 2023కు సంబంధించి పంట నమోదు (ఈ క్రాప్) జాబితాను ఏఓ సురేష్ సోమవారం ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఈ క్రాప్ నమోదు జాబితా అందుబాటులో ఉందన్నారు.